# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు భూమి పూజ చేసిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **విశాఖపట్నం కేంద్రంగా జూన్ 1న దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని వెల్లడించిన కేంద్రమంత్రి  అశ్విని వైష్ణవ్.**

3. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని  దర్శించుకున్న ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్.**

4. **ఆక్వా రంగానికి ఇంధన కొరత రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

5. **విజయనగరం జిల్లాలో జరిగిన రహదారి  ప్రమాదంలో నలుగురు మృతి, పలువురికి గాయాలు.**

==========================

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు  భూమి పూజ చేశారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తర్లువాడలో జరిగిన ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు  శ్రీనివాసవర్మ, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వి.అనిత పాల్గొన్నారు. మొత్తం 1.35 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది.  శంకుస్థాపన కార్యక్రమానికి ముందు గూగుల్ ఎక్స్ పీరియన్స్ జోన్ ను ముఖ్యమంత్రితో కలిసి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పరిశీలించారు.

అనంతరం జరిగిన సభలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ,  రైల్వే  బడ్జెట్ లో ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 10 వేల 134 కోట్ల రూపాయలు  కేటాయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 74 రైల్వే స్టేషన్లలో  పూర్తి స్థాయి ఆధునీకరణ పనులను చేపట్టామని అన్నారు.  దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు సంబంధించిన  ప్రక్రియ పూర్తయిందని, జూన్ 1న రైల్వేజోన్ ప్రారంభమవుతుందని  పేర్కొంటూ..

వాయిస్ ..25.. సెకన్లు

అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విశాఖపట్నం గూగుల్ డేటా సెంటర్ దేశానికే గ్రోత్ ఇంజిన్ అని పేర్కొన్నారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొంటూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో అంతరాయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నం నుంచి దృశ్య శ్రవణ మాధ్యమ విధానంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, చమురు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. చమురు సంస్థల నుంచి పెట్రోల్ బంకులకు సరఫరాపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరంతరం సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇంధన నిల్వ లేని బంకుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం 432 బంకులు మినహా మిగతా అన్ని బంకుల్లో ఇంధనం అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇంధన సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరేంత వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్యూలైన్లు లేకుండా చూడాలని, అవసరమైతే టోకెన్ లేదా స్లాట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే వకుళమాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి ఆలయాలను సందర్శించారు. తరువాత రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి విశాఖపట్నం జిల్లాలోని దువ్వాడ వరకు 3వ, 4వ రైలు మార్గాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందరేశ్వరి తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఈ రోజు స్పందిస్తూ... సుమారు 9వేల 889 కోట్ల రూపాయల వ్యయంతో 198 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్ట్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని అన్నారు. గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల రైల్వే వంతెన, మూడు బైపాస్‌లు నిర్మించనున్నట్లు వివరించారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి పుణ్యక్షేత్రాలకు ప్రయాణం సులభమవుతుందని, ఉత్తరాంధ్ర--గోదావరి జిల్లాల అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ దోహదం చేస్తుందని దీనికి ఆమోదం తెలిపినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఆక్వా రంగానికి ఇంధన కొరత రాకుండా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో డీజిల్, పెట్రోల్ కొరత, ఇంధన సరఫరాపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పెట్రోల్ బంకుల్లో సరిపడా డీజిల్, పెట్రోల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు, ఆక్వా రంగం ఇబ్బంది పడకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిల చెల్లింపుల కోసం 1,000 కోట్ల రూపాయలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.రాష్ట్రంలో మొత్తం 873 ప్రైవేటు ఆసుపత్రులకు 2,044 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో 1,000 కోట్ల బిల్లుల పరిశీలన పూర్తయిందని చెప్పారు. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రుల బ్యాంకు ఖాతాల్లోకి చెల్లింపులు జమ చేయడం ప్రారంభమైందని అన్నారు. మిగిలిన బకాయిల చెల్లింపులు కూడా దశలవారీగా పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

విజయనగరం జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పూసపాటిరేగ మండలం పేరాపురం సమీపంలో జాతీయ రహదారి 16పై శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి రహదారి పక్కన నిలిచిన వ్యక్తులను ఢీకొట్టి, అనంతరం లారీని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఘటన స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రయాణికులు జాగ్రత్తగా, నియమాలు పాటిస్తూ ప్రయాణించాలని.. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త నాటక రచయిత కాళ్ళకూరి నారాయణరావు జయంతి ఈరోజు, “మహాకవి” బిరుదాంకితులైన ఆయన 1871 ఏప్రిల్ 28వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో జన్మించారు. వరకట్నం దురాచారాన్ని నిరసిస్తూ ఆయన రచించిన ‘వరవిక్రయం’ నాటకం తెలుగునాట ఎంతో ప్రాచుర్యం పొందింది. సంఘ సంస్కరణ లక్ష్యంగా చింతామణి, మధుసేవ వంటి రచనలు చేసిన కాళ్ళకూరి నారాయణరావు 1927 జూన్ 27వ తేదీన తుదిశ్వాస విడిచారు.

======================